సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
మంగళవారం । 19 । నవంబర్ । 2024



'ఏపీజీబీ' తరలింపు వద్దు

ఏపీజీబీ కార్యాలయాన్ని అమరావతికి తరలించకుండా కృషి చేయాలని బ్యాంకర్లు మాజీ డిప్యూటీ సీఎంను కోరారు. -8లో



హమాలీల సమ్మె నోటీసు

ప్రభుత్వ వైఖరికి నిరసనగా సివిల్ సప్లయిస్ హమాలీలు సమ్మెలోకి వెళ్లాలని యూనియన్ నాయకులు నిర్ణయించారు. -8లో

గరిష్టం/కనిష్టం
30.8/23.6

వాతావరణం

జిల్లాలో సోమవారం 23.6 - 30.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

ఊపందుకున్న రబీ సాగు



శనగ విత్తనాలు విత్తుతున్న రైతులు



రాజుపాళెం మండలంలో సాగు చేసిన శనగ పంట

- ఐదు రోజులుగా వర్షాలు
- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- కళకళలాడుతున్న పంటలు
- ఆనందంలో అన్నదాతలు

కడప అగ్రికల్చర్ : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో ఐదు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రబీ సాగు ఊపందుకుంది. రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన శనగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీతో అందించింది. అలాగే వేరుశనగకాయలు అందించేందుకు సిద్ధం చేస్తున్నారు. అన్ని రకాల ఎరువులను రైతు సేవా కేంద్రాల్లో ఉంచారు. చాలా మండలాల్లో వర్షం కురవడంతో ఆరుతడి పంటల సాగు ఊపందుకుంది. శనగతోపాటు పెసర, మినుము, అలసంద సాగు చేస్తున్నారు. అలాగే ముందుగా వేసిన పలు పంటలు కళకళలాడుతున్నాయి.

పెరిగిన సాగు

జిల్లాలో ఐదు రోజుల నుంచి సాగు ఊపందుకుంది. ఈ నెల 11 నాటికి 23,810 హెక్టార్లలో వివిధ పంటలు సాగై 16.65 శాతంగా నమోదైంది. ఈ నెల 16కు 55764 హెక్టార్లకు చేరుకుని 38.99 శాతం మేర నమోదైంది. అంటే వర్షం వచ్చిన నాలుగైదు రోజుల్లోనే సాగు బాగా పెరిగింది. దాదాపు 31954 హెక్టార్ల సాగు పెరిగింది. అలాగే ఈ నెల 11 నాటికి శనగ 16704 హెక్టార్లలో సాగు కాగా 16 నాటికి 44258 హెక్టార్లకు చేరుకుంది. ఐదు రోజుల్లోనే 27554 హెక్టార్లలో సాగైంది.

ఈ వారంలో మరింత..

రబీ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 1,42,988 హెక్టార్లు కాగా ఇప్పటికి 55,744 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో జొన్న 7917 హెక్టార్లకు గాను 1189 హెక్టార్లలో సాగైంది. మొక్కజొన్న 1440 హెక్టార్లు కాగా 650 హెక్టార్లలో, శనగ 82261 హెక్టార్లకు గాను 44258 హెక్టార్లు, పచ్చపెసలు 3182 హెక్టార్లకు గాను 584 హెక్టార్లు, మినుము 14731 హెక్టార్లకు గాను 7300 హెక్టార్లు, వేరుశనగ 6236 హెక్టార్లకు గాను 558 హెక్టార్లు, నువ్వు 5070 హెక్టార్లకు గాను 288 హెక్టార్లలో సాగయింది. ఈ వారంలో పంటల సాగు మరింత పెరగనుంది.

రెండు నెలల్లో..

అక్టోబర్, నవంబర్‌లో బాగా కురిసిన వర్షాలు రబీ సీజన్‌కు అనుకూలించాయి. రబీలో అక్టోబర్‌లో సాధారణ వర్షపాతం 132.1 మిల్లీమీటర్లు కాగా 153.7 మి.మీ నమోదైంది. నవంబర్‌లో 61.6 కాగా ఇప్పటికి 44.1 మి.మీ వర్షం కురిసింది.

లక్ష్యం చేరుకుంటాం



జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలలో ఆరుతడి పంటల సాగు ఊపందుకుంది. కానీ అక్కడక్కడా ముందుగా వేసిన వరికి కొంత ఇబ్బంది కలిగినా మిగతా ఆరుతడి పంటలకు మేలు జరిగింది. కొన్ని దీర్ఘకాలిక ఉద్యాన పంటలకు జీవం వచ్చింది. మరో పది రోజుల్లో సాగు మరింత పెరగనుంది. ఏదిఏమైనా రబీలో వంద శాతం సాగు లక్ష్యం చేరుకుంటాం.

- అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

కార్తికం.. దివ్య శోభితం

కార్తిక మాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాలయాలు కార్తిక దీపాలతో మెరిశాయి. మరో వారంలో కార్తీక మాసం ముగియనుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వర్షాలు కురుస్తుండటం వల్ల వచ్చే సోమవారం పరిస్థితి ఎలా ఉంటుందోనన్న సందేహంతో భక్తులు కుటుంబాలతో సహా తరలివచ్చారు. పుష్పం, పత్రం సమర్పించి మొక్కుకున్నారు. జిల్లాలో ప్రముఖ శివాలయాలైన పుష్పగిరి, ప్రొద్దుటూరు అగస్త్యేశ్వర, రామేశ్వర ఆలయాలు, పొలతల, అత్తిరాల, కన్యతీర్థం, నిత్యపూజస్వామి కోన, రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయం, బైరవకోనలో భక్తులు పెద్ద సంఖ్యలో శివయ్యను దర్శించుకుని పూజలు చేశారు.



పులివెందుల మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవంలో శివపార్వతులు

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పొలతల శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. అలాగే జిల్లాలో మరికొన్ని శైవ క్షేత్రాల్లో శివ కల్యాణాలు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఇందులో పాల్గొని పూజలు చేశారు.

– కడప కల్చరల్



ప్రొద్దుటూరు ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి టైలరింగ్, బ్యూటీ పార్లర్‌లో 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగి గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలు అర్హులని ఆయన పేర్కొన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం స్థానికంగానే కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు : 94409 05478, 99856 06866, 94409 33028 లలో సంప్రదించాలని వివరించారు.

డ్వామా పీడీగా ఆదిశేషారెడ్డి



కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బి.ఆదిశేషారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా పని చేస్తున్న ఆదిశేషారెడ్డిని జిల్లా డ్వామా పీడీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో తాను బాధ్యతలు స్వీకరిస్తానని తెలియజేశారు.

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్ : జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం వర్షం కురిసింది. పెండ్లిమర్రిలో అత్యధికంగా 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే రాజుపాళెంలో 10.8, పెండ్లిమర్రి 19.2, చింతకొమ్మదిన్నె 9.6, ఒంటిమిట్ట 8.4, కడప 8, ప్రొద్దుటూరు 4.2, దువ్వూరు 2.8, చెన్నూరు 1.6, ముద్దనూరులో 1.2 మి.మీ వర్షం పడింది.

రేపు డయల్ యువర్ ఆర్‌ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కార నిమిత్తం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలను 995922 5848 నంబరుకు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు.

108 సిబ్బంది నిరాహార దీక్ష



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న 108 ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పిలుపులో భాగంగా 108 సర్వీసు ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. వారికి సీఐటీయూ నాయకులు బి.మనోహర్, వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు దఫాలుగా శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు.. పరిష్కరించకపోవడంతో రిలే దీక్షలు చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే ఈనెల 25 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు బయపురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఓం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతే ధ్యేయం



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

జమ్మలమడుగు : దివ్యాంగులు స్వయం సంపత్తి సాధించి స్వతంత్రంగా వారి కాళ్లమీద నిలబడేలా చేయడమే తమ ధ్యేయమని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖ మంత్రి బీఎల్ వర్మ అన్నారు. జమ్మలమడుగులోని నానుబాల ఫంక్షన్ హాల్‌లో దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చెరకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి శనివారం నిర్వహించారు. వర్చువల్ విధానంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యున్నతే తమ ధ్యేయమని తెలిపారు. ఆర్డీఓ సాయిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.లక్ష విరాళం

విజయవాడ వరద బాధితులకు సాయంగా స్థానిక బాలాజీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సీఎం సహాయనిధికి లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. సోమవారం బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ బైరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో పిల్లలు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి విరాళం అందించారు.

అర్జీదారుల వినతులు పరిష్కరించాలి



సమస్యలను ఆలకిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారితోపాటు డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుంచి అందిన విజ్ఞప్తులలో కొన్నింటి వివరాలిలా ఉన్నాయి.

- తన కుమారుడికి వికలాంగ పెన్షన్ మంజూరు చేయాలని జమ్మలమడుగు మండలం మొరగుడి గ్రామానికి చెందిన టి.ధనలక్ష్మి కోరారు.
- తన ఏడేళ్ల వయసు ఉన్న ఎదుగుదల లేదని బిడ్డను వైద్యులకు చూపగా ఆపరేషన్ చేయాలని, అందుకు రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారని, ఆపరేషన్ నిమిత్తం ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించడంతోపాటు ఆరోగ్య శ్రీ కార్డు నమోదు చేయించాలని సిద్దవటంలోని మాదిగవాడకు చెందిన పొన్నూరు వెంకటమ్మ విన్నవించారు.
- సర్వే నంబర్ 74లో 25 సెంట్ల భూమికి సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని ఖాజీపేటకు చెందిన మహబూబ్ హుస్సేన్ కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి భక్త కనకదాసు

తత్వవేత్త, కవి, సంగీతకారుడు, స్వరకర్త అయిన భక్త కనుకదాసు సమాజాన్ని మెప్పించిన ఆదర్శ మూర్తి అని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కనకదాసు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ కనకదాసు కర్ణాటక సంగీతంకోసం ఎనలేని సేవ చేశారన్నారు. కర్ణాటకలో జన్మించిన ఆయన మంచి విద్యావంతునిగా సమాజాన్ని అన్ని కోణాల్లో సూక్ష్మ పరిశీలన చేశారని తెలిపారు. చిన్న వయసులోనే నరసింహస్తోత్రం, రామధాన్యమంత్రం, మోహన తరంగిణి రచించారని వివరించారు. కురవ కులానికి చెందిన కనకదాసు అప్పట్లో కుల వివక్షను ఎదుర్కొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి కృష్ణయ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, ఉపాధి కల్పనాధికారి సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతెహా



ప్రఖ్యాత కవుల ముషయిరాలో పాల్గొన్న రామ్ చరణ్, పీఠాధిపతి, భక్తులు



ముషాయిరా చెబుతున్న కవి

- మలంగ్‌షాచే దీక్ష విరమింపజేసిన పీఠాధిపతి
- భక్తులకు మహానైవేద్యం పంపిణీ
- ప్రత్యేక అతిథిగా సినీ నటుడు రామ్‌చరణ్‌తేజ్

కడప కల్చరల్ : కడప పెద్ద దర్గాలోని సయ్యద్‌షా ఆరీఫుల్లా మొహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా సోమవారం తహలీల్ ఫాతెహా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ తమ స్వగృహం నుంచి ఫకీర్ల మేళతాళాలు, విన్యాసాల మధ్య ఊరేగింపుగా మహా నైవేద్యంగల పవిత్రమైన పాత్రను దర్గా ప్రాంగణంలోకి తీసుకు వచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పాత్రలోని నైవేద్యాన్ని భక్తులకు ప్రసాదంగా పంచి పెట్టారు. ఉరుసు ఉత్సవాల్లో తహలీల్ ఫాతెహాగా అందించే ప్రసాదం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో వేచి ఉన్నారు. ప్రార్థనల అనంతరం దర్గా నిర్వాహకులు భక్తులందరికీ ప్రసాదాన్ని పంచిపెట్టారు. ప్రధాన గురువుల మజార్ల వద్ద పీఠాధిపతి ప్రార్థనలు చేశారు.

మలంగ్‌షా దీక్ష విరమణ

ఉరుసు ఉత్సవాల ప్రారంభం నాడు తపోదీక్ష వహించిన మలంగ్‌షా సోమవారం దీక్ష విరమించారు. పీఠాధిపతి సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ శిష్య గణంతో కలిసి ఊరేగింపుగా వెళ్లి మలంగ్‌షాను స్వయంగా దీక్ష విరమింపజేశారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున అట్టహాసంగా మేళతాళాలు, సాహస విన్యాసాలతో మలంగ్‌షాను దర్గా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణలు చేయించారు. దర్గా ముజావర్ అమీర్ పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

రామ్‌చరణ్ ప్రత్యేక ప్రార్థనలు

నటుడు రామ్‌చరణ్‌తేజ్ పెద్దదర్గా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్నారు. సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. కడపకు వచ్చిన ఆయన శ్రీ విజయదుర్గాదేవి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి నేరుగా పెద్దదర్గాకు చేరుకున్నారు. దర్గాలోని ప్రధాన గురువుల మజార్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ముషాయిరాలో పాల్గొన్నారు. సినీ నటుడు రామ్‌చరణ్ వెంట దర్శకుడు బుచ్చిబాబు, అభిమాన సంఘం నాయకులు వచ్చారు.



పెద్ద దర్గాలో భారీగా భక్తజనం

ప్రతిభకు పరీక్ష



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

- అభ్యసనా సామర్థ్యాల మెరుగుకు చర్యలు
- 3,6,9 తరగతుల విద్యార్థుల ప్రావీణ్యం పరిశీలన
- పరఖ్ సర్వేక్షణకు 139 పాఠశాలలు ఎంపిక
- డిసెంబర్ 4న ఓఎంఆర్ విధానంలో నిర్వహణ

కడప ఎడ్యుకేషన్ : జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి చదువే మూలం. అలాంటి విద్య విషయమై ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు ఏ మేరకు ఉన్నాయని పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పెర్మార్మెన్స్ అసెస్‌మెంట్ రివ్యూ అండ్ అనలైసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ (పరఖ్ సర్వేక్షణ-2024) పేరుతో పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ -2024ను(గతంలో నాస్) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సర్వేను 2021లో చివరి సారిగా నిర్వహించారు. మరలా తిరిగి ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహణకు విద్యాశాఖ, సమగ్రశిక్ష, ఎస్‌సీఈఆర్‌టీలు చర్యలు చేపట్టాయి. ఇందుకు సంబంధించిన సామర్థ్య పరీక్షను డిసెంబర్ 4న జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో నిర్వహించనున్నారు.

ఒక్కో పాఠశాల నుంచి..

వైఎస్‌ఆర్ జిల్లాలోని 139 పాఠశాలలను ఈ పరీక్ష కోసం ఎంపిక చేశారు. ఇందులో ఒక్కో పాఠశాల నుంచి తరగతికి 30 మంది చొప్పున 3 తరగతులకు సంబంధించిన విద్యార్థులను ఎంపిక చేస్తారు. పరాఖ్ నిబంధనలకు అనుగుణంగా ఎంపిక ఉంటుంది. జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లా స్థాయి కో ఆర్డినేటర్‌గా, డీసీఈబీ సెక్రటరీ సహాయ జిల్లా స్థాయి కో ఆర్డినేటర్‌గా వ్యవహరించనుండగా సమగ్రశిక్ష ఏఎంఓ, డైట్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్లు ఈ పరీక్షల నిర్వహణకు సహకారం అందించనున్నారు. మండల స్థాయిలో పరీక్షల నిర్వాహకులుగా ఎంఈఓలతో పాటు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వ్యవహరిస్తారు. పరీక్షను పక్కాగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది. పరీక్ష నిర్వహించేందుకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లను ఎంపిక చేశారు. వీరందరికీ ఈ నెల 20న డిస్ట్రిక్ లెవల్ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

పరీక్షలు ఇలా..

ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహించే పరాఖ్ పరీక్షకు ముందుగా ప్రాక్టీస్ పేపర్ల ద్వారా తర్ఫీదు ఇస్తారు. ఇందులో 3, 6 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషియల్, సైన్సు సబ్జెక్టులపై పరీక్షలు ఉంటాయి. 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతి సిలబస్ ఉంటుంది. వీరికి 45 ప్రశ్నలతో 90 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. అలాగే 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతి సిలబస్ ఉంటుంది. వీరికి 51 ప్రశ్నలతో 90 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్ ఉంటుంది. వీరికి 60 ప్రశ్నలతో 120 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. ఓఎంఆర్ షీటు విధానంలో పరీక్ష ఉంటుంది.

20న శిక్షణ



పరాఖ్ పరీక్ష కోసం ఎంపిక చేసిన 165 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు, అబ్జర్వర్లు, మండల విద్యాశాఖ అధికారులకు ఈ నెల 20న ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశాం. ఈ శిక్షణ కడపలోని డీసీఈబీలో ఉంటుంది. పరీక్షల నిర్వహణపై పూర్తి సాయి అవగాహన కలిగిస్తాం.

- విజయ భాస్కర్‌రెడ్డి, సెక్రటరీ, డీసీఈబీ

సమర్థవంతంగా..



జిల్లా వ్యాప్తంగా పరాఖ్ పరీక్ష సమర్థవంతంగా నిర్వహిస్తాం. అవసరమైన ఏర్పాట్లు, సిబ్బంది నియామకం కూడా పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో 3, 6,9 తరగతులకు సంబంధించి విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

- మీనాక్షి, జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రజా సమస్యలపై పోరాటం



ప్రజల సమస్యలు వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోరాటాలు చేయడానికి, ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచిపోయారన్నారు. అధికారంలోకి వచ్చాక మాట మార్చారన్నారు. అనంతరం కార్యకర్తలు, నాయకులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తామన్నారు. సమస్యలు విన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పురస్కరించే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడతామన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో బద్వేలు ఎమ్మెల్యే సుధా, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు భయపరెడ్డి, బలరాంరెడ్డి, రసూల్, బ్రహ్మానందరెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న ఎస్పీ



కోదండరామయ్య సన్నిధిలో ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు దంపతులు

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని సోమవారం అన్నమయ్య, కడప ఉమ్మడి జిల్లాల ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆలయ ప్రదక్షణగావించి, బాలాలయంలోని సీతారామ లక్ష్మణ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఏఐఎస్‌ఎఫ్ నూతన కమిటీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగరంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఏఐఎస్‌ఎఫ్ జిల్లా మహాసభలు ముగింపు సందర్భంగా సోమవారం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా కె.శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా గుజ్జుల వలరాజు ఎన్నికయ్యారు. అలాగే 37 మంది కౌన్సిల్ మెంబర్స్, 11 మంది ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ తేజ, పీటర్, లీలాకృష్ణ, చంద్ర, అరుణ్, చక్రిధర్, హేమ శంకర్, వెంకట్ రెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సోమవారం రాత్రి ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక (16)ను అదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యం వేధిస్తుండటంతో అతనిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఈ కేసు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ పడటంతో 10మందిపై కేసు నమోదు చేశామన్నారు.

పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ధర్నా

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన మూడు సెంట్ల స్థలం హామీని వెంటనే నెరవేర్చాలని సీపీఐ నాయకుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్ల స్థలంతోపాటు ఇంటి నిర్మాణం కోసం నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణ, వెంకటరమణ, మునిరెడ్డి, మధు, శ్రీనివాసులు, గురుస్వామి పాల్గొన్నారు.

స్పెషల్ వార్డులో వృద్ధురాలికి చికిత్స

సాక్షి ఎఫెక్ట్..

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలోని స్పెషల్ వార్డుకు తరలించి వృద్ధురాలు హుసేన్‌బీకి వైద్యం అందిస్తున్నారు. ముద్దనూరు మండలంలోని దేవేపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు హుసేన్‌బీ అనారోగ్యంతో బాధపడుతుండగా జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి సిబ్బంది జీఈ వార్డుకు తరలించారు. వార్డులో ఉన్న వృద్ధురాలు మరుగుదొడ్డికి వెళ్లి అక్కడే పడిపోయిన విషయం తెలిసిందే. దీనిపై సాక్షిలో 'మంట గలిపిన మానవత్వం' అనే వార్త ప్రచురితం కావడంతో ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించి హుసేన్‌బీని ఆస్పత్రి లోని ప్రత్యేక వృద్ధుల వార్డుకు తరలించి పూర్తి స్థాయిలో వైద్యం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సివిల్ సప్లయీస్ హమాలీల సమ్మె నోటీసు

- కూలి రేట్ల పెంపులో ప్రభుత్వం నిర్లక్ష్యం
- పౌరసరఫరాలపై ప్రభావం చూపే అవకాశం



సివిల్ సప్లయీస్ డీఎం కార్యాలయం వద్ద హమాలీల ఆందోళన

కడప సెవెన్‌రోడ్స్ : కూలి రేట్ల పెంపులో రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నిరవధిక సమ్మెలోకి వెళ్లాలని ఏఐటీయూసీ అనుబంధ సివిల్ సప్లయీస్ హమాలీ వర్కర్స్ యూనియన్ నిర్ణయించింది. ఈనెల 20 తర్వాత మెరుపు సమ్మె చేపట్టనున్నారు. సోమవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ కేసీ బాదుల్లా నాయకత్వంలో హమాలీలు పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ అర్జున్‌రావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఇది ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతినెలా ప్రజలకు అందించే నిత్యావసర సరుకులకు ఆటంకం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించినా హమాలీలు అడ్డుకునే అవకాశం లేకపోలేదు. నిత్యావసర సరుకుల సరఫరాకు ఆటంకం కలిగితే అందుకు ప్రభుత్వానిదే బాధ్యత అని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. స్టాక్ పాయింట్లలో పని చేస్తున్న హమాలీలకు జనవరి నుంచి కూలి రేట్లు పెంచి అమలు చేయాల్సి ఉన్నప్పటికీ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతూ సామాన్యుని జీవనం భారంగా మారిందన్నారు. దీనికి అనుగుణంగా హమాలీల కూలిరేట్లు పెంచాలన్నారు. ప్రతి దసరాకు బోనస్ పెంచాల్సి ఉన్నప్పటికీ ఈ యేడు పాత పద్ధతిలోనే చెల్లించారని, మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికితీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో స్వీపర్లను తక్షణమే నియమించాలని, పీఎఫ్ క్లెయిమ్స్ కొత్త వారి పేర్లు చేర్చాలని, అక్షర దోషాలు సరిచేయాలని కోరారు. రిటైర్ అయిన, మృతి చెందిన హమాలీలకు పీఎఫ్ క్లెయిమ్స్ పరిష్కరించి పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఈ యేడు జనవరి 1 నుంచి కూలి రేట్లు పెంచి అరియర్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు బాల గురవయ్య, మురారి, శ్రీరాములు, రామాంజనేయులు, వెంకటరమణ, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులకు సత్కారం



ఉత్తమ అధ్యాపక పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న వైవీయూ అధికారులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎల్. వీరాంజనేయరెడ్డి (మైక్రోబయాలజీ), ఆచార్య జి. విజయభారతి (కామర్స్), ఎం. అనిత(ఎకనామిక్స్)లను వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ ఘనంగా సత్కరించారు. వైవీయూలో శనివారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ అవార్డు గ్రహీతలైన ఎల్. వీరాంజనేయరెడ్డి దేశంలోని టాప్–2 సైంటిస్టులలో ఒకరిని, డీఎస్‌టీ, ఫిస్ట్, యూజీసీ ప్రాజెక్టులు పొంది పరిశోధనల్లో ముందుకు వెళుతున్నారని అభినందించారు. ఆచార్య అనిత సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి కావడం చేత సహజంగానే పరిశోధనలో ముందున్నారన్నారు. ఆచార్య జి. విజయభారతి అకడమిక్‌గా, పరిశోధనలపరంగా కార్యక్రమాల పరంగా అభివృద్ధి పథంలో ముందున్నారని తెలిపారు. ఇక్కడే చదివి, ప్రొఫెసర్‌గా బెస్ట్ టీచర్ పురస్కారం అందుకోవడం ప్రశంసనీయమన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే యేడాది మరిన్ని అవార్డులు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించరాదు

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషకు వినతి



అంజద్‌బాషాకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఏపీజీబీ బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లను సత్వరమే ఉపసంహరించుకోవాలని బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.హరిప్రసన్నకుమార్, కె.జగదీశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం వారు మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషాను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అన్ని కార్యాలయాలు అమరావతిలో కేంద్రీకరించాలని భావిస్తున్న నేపథ్యంలో నూతనంగా ఏర్పడబోతున్న గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కూడా అమరావతికి తరలిపోతుందన్న ఆందోళన నెలకొందన్నారు. అత్యంత కరువు ప్రాంతాల్లో పనిచేస్తున్నప్పటికీ, ఎక్కువ లాభాలు, అత్యధిక నిల్వలు, వ్యాపారంతో ప్రత్యేకంగా వెనుకబడిన వర్గాలకు రుణాలు ఇవ్వడంలో కీలకపాత్ర పోషించినటువంటి గ్రామీణ బ్యాంక్ తరలించడం తగదన్నారు. ఈ అంశం ప్రాంత అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. మిగతా ప్రాంతాలతో పోల్చితే వెనుకబడిన రాయలసీమలో ఎటువంటి ముఖ్యమైన కార్యాలయాలు, సంస్థల కార్యాలయాలు లేకపోవడం బాధాకరమన్నారు. అంజద్‌బాషా మాట్లాడుతూ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగేలా తమవంతుగా కృషి చేస్తానని హామీమి ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు హనుమంతరెడ్డి, మహమ్మద్, పీవీ రాహుల్‌తేజ్, కేఎస్ లోహిత్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

– జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)కె. ప్రకాష్‌బాబు

కడప అర్బన్ : జిల్లాలో ప్రజలు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు ఫిర్యాదు దారులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులను అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పెన్షనర్ల న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించి ఆయా కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కడపలోని పీఎఫ్ కార్యాలయం వద్ద పెన్షనర్లు విద్రోహ దినం పాటించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇపీఎస్ పెన్షనర్స్‌కు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస పెన్షన్ రూ. 9000గా నిర్ణయించాలని సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకోక పోవడం తగదన్నారు. ఇపీఎస్ పెన్షనర్లకు పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి అన్ని వర్గాల ప్రజలపై భారాలు మోపుతున్నాయన్నారు. నిత్యాసర వస్తువుల ధరలు మొదలుకొని గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ఈపీఎస్ పెన్షనర్స్‌కు వెయ్యి రూపాయలు పెన్షన్ ఇస్తే ఏ రకంగా బతుకుతారని ప్రశ్నించారు. ధరలు పెంచిన ప్రభుత్వం పెన్షన్ పెంచాల్సిన బాధ్యత లేదా అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెన్షనర్ దారులకు ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని, ఈఎస్ఐ, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షనర్లకు గతంలో రైల్వేలో రాయితీలు ఇచ్చే వారిని ఇప్పుడు రద్దు చేయడం అన్యాయమన్నారు. పెన్షనర్స్ సమస్యలపై గతంలో హైపవర్ కమిటీ వేశారని, దానిని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలపై ఫిబ్రవరిలో ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో వామపక్ష కార్మిక సంఘాల నాయకులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, నాగ సుబ్బారెడ్డి, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ నాయకులు కళ్యా సుధాకర్, విద్యుత్ కార్మిక సంఘం నాయకులు సుదర్శన్‌రెడ్డి, యూటీఎఫ్ టీచర్స్ నాయకులు లక్ష్మీ రాజా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు



విజేతలైన క్రీడాకారులతో నిర్వాహకులు

గుడివాడ టౌన్ : ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న అండర్–19 బాలురు, బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ నెల 16న ప్రారంభమైన పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ కేటగిరీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో స్ట్రాంగ్‌మ్యాన్‌గా డి. భానుతేజ (వైఎస్సార్ కడప జిల్లా), స్ట్రాంగ్ ఉమన్‌గా కె. తరంగిణి(తూర్పు గోదావరి) టైటిల్ సాధించగా ఓవరాల్ చాంపియన్‌షిప్ వైఎస్సార్ కడప జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె. దామోదరరావు, జిల్లా కార్యదర్శి రవి, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి నరేంద్ర, కృష్ణా జిల్లా ఖో–ఖో అసోసియేషన్ కార్యదర్శి మడకా ప్రసాదు, ఎన్టీఆర్ స్టేడియం జిమ్ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సినీహీరో సుమంత్‌కు సన్మానం



హీరో సుమంత్‌ను సన్మానిస్తున్న నల్లం రవిశంకర్, తదితరులు

ప్రొద్దుటూరు క్రైం : సినీ నటుడు సుమంత్‌ను ప్రొద్దుటూరు అక్కినేని అభిమానులు సన్మానించారు. సోమవారం రాత్రి రాయల్ కౌంటీలో అక్కినేని అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లం రవిశంకర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రముఖ చారిత్రాత్మక ప్రాంతమైన గండికోటలో సుమంత్ హీరోగా 'మహేంద్ర గిరిలో వారాహి' అనే చిత్ర షూటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం విజయవంతం కావాలని వారు ఆకాంక్షించారు. కడప జిల్లా వాసులు తనపై చూపుతున్న అభిమానాన్ని మరువనని సుమంత్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో అభిమానులు ఖలీల్, మనోహర్, సుదర్శన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పనివేళలు పెంచడం సరికాదు

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పనివేళలు మార్చాలనే ప్రభుత్వ నిర్ణయం సరికాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా పాఠశాలల పనివేళల్లో మార్పులు చేయడం సబబుకాదన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించకుండా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య సమయం అంతా బోధనకు మాత్రం పరిమితం చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ఒకవైపు డిమాండ్ చేస్తుంటే పాఠశాలల పనివేళలు సాయంత్రం 5 గంటల వరకు పెంచడం సహేతుకం కాదని అభిప్రాయ పడ్డారు. ఉపాధ్యాయులను మానసికంగా ఇబ్బందిపెట్టాలనే అత్యుత్సాహం తప్ప బోధనలో నాణ్యతా ప్రమాణాలు ఎలా అభివృద్ధి చేయాలా అనే లక్ష్యాలు కనుచూపు మేరలో కనిపించడం లేదన్నారు. ఇది విద్యారంగ సంక్షేమానికి ఉపయోగకరం కాదన్నారు. ఏపీలో పని వేళలు పెంచడానికి పైలట్ ప్రాజెక్టు చేపట్టడంలోని ఔచిత్యమేమిటని ప్రశ్నించారు. పనివేళల హెచ్చింపు అనివార్యమని ప్రభుత్వం భావిస్తే తద్వారా సాధించదలచుకున్న లక్ష్యాలను చదువు చెప్పే ఉపాధ్యాయులకు తెలియజెప్పాలన్నారు. అలా కాకుండా ఒక రహస్య అజెండాతో ముందుకెళ్లడం ఏమాత్రం శ్రేయస్కరం కాదన్నారు. పాఠశాల పని వేళలు ఎలా ఉండాలనేది విద్యార్థుల్లో అభ్యసన సంసిద్ధత, మానసిక పరిపక్వత, స్థానిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, ప్రజల జీవన విధానం వంటి అనేక అంశాలతో ముడిపడి ఉన్నాయన్నారు. 70 శాతానికి పైబడి గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రామాణికంగా తీసుకొని ప్రయోగాలు చేయాలి తప్ప అన్ని వసతులు కలిగిన పట్టణ ప్రాంతాలతో బేరీజు వేయకూడదన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఎస్టీయూ వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

వరకట్నం వేధింపుల కేసులో ఐదేళ్లు జైలు

- రూ.3.09 లక్షల జరిమానా
- నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందికి ఎస్పీ అభినందనలు

పులివెందుల రూరల్ : వరకట్నం వేధింపుల కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3.09 లక్షల జరిమానా విధిస్తూ సోమవారం అదనపు సీనియర్ సివిల్ జడ్జి కే. ప్రత్యుషా కుమారి తీర్పునిచ్చారు. వివరాలిలా.. పట్టణంలోని జెండామాను వీధిలో ఉంటున్న గూడుబాయి అల్లాబకాష్ కుమార్తె రేష్మాను స్థానిక అదే వీధికి చెందిన షేక్ మహబూబ్ బాషా కుమారుడు మహమ్మద్ రఫీకి ఇచ్చి 2008లో వివాహం చేశాడు. కట్నం కింద 22 తులాల బంగారం, రెండు లక్షల రూపాయలు నగదు ఇచ్చి వివాహం చేశారు. కొంత కాలం భార్య భర్తలు సంతోషంగా ఉన్నారు. వారికి ముగ్గురు పిల్లలు. ఆ తరువాత భర్త తాగుడుకు బానిసై అదనపు కట్నం కోసం భార్యను వేధించడం, మానసిక క్షోభకు గురిచేస్తున్నాడు. విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో కూతురి కాపురం బాగుండాలని 3 లక్షల అదనపు కట్నం ఇచ్చారు. అయినా భర్త, అత్తమామల వేధింపులు ఆగలేదు. దీంతో రేష్మా 01.02.2018న రాత్రి తల్లిదండ్రులకు ఫోన్ చేసి భర్త, అత్తమమాలు కొడుతూ వేధిస్తున్నారు. తాను చనిపోతున్నాని చెప్పిందన్నారు. ఆ రాత్రి రాత్రి 11 గంటలకు ఉరి వేసుకుని రేష్మా చనిపోయింది. మృతురాలి సోదరుడు హబీబుల్లా ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేశారు. కేసు పూర్వాపరాలు కోర్టుకు సమర్పించారు. ఈ కేసును విచారించిన అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు అదనపు సీనియర్ సివిల్ జడ్జి కే. ప్రత్యుషా కుమారి నేరం రుజువు కావడంతో నిందితుడు మహమ్మద్ రఫీ (38)కి ఐదు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష, రూ.3.09లక్షల జరిమానా విధించారు. సాక్ష్యాలతో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అభినందించారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం



ధర్నా చేస్తున్న ఏపీ మాల మహానాడు నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : రీ సర్వే పేరుతో వందల ఎకరాల ప్రభుత్వ భూములు అగ్రవర్ణాల వారికి కట్టబెట్టిన రెవెన్యూ అధికారులపై చర్యలు చేపట్టాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అట్లూరు మండలంలో పనిచేసిన తహసీల్దార్ ఈశ్వరయ్య, శ్రీవాణి ప్రభుత్వ, మాజీ సైనికులకు ఇచ్చిన భూములను రద్దు చేసి అనర్హులకు కట్టబెట్టారని ఆరోపించారు. తహసీల్దార్ ఈశ్వరయ్యను సస్పెండ్ చేసినప్పటికీ ఆయన చేసిన భూముల ఆన్‌లైన్ ఇంకా రద్దు చేయలేదన్నారు. అగ్రవర్ణాలు పేదలైన లబ్ధిదారులను బెదిరిస్తున్నారన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని ఎస్సీ కమిషన్ నుంచి కలెక్టర్‌కు ఆదేశాలు వచ్చినా విచారణ జరగలేదన్నారు. జిల్లాలోని అట్లూరు, ప్రొద్దుటూరు, మైదుకూరు, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, కడప, ఖాజీపేట మండలాల్లో అనేక అవకతవకలకు కారణమైన తహసీల్దార్లపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. జెడ్పీ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ కాంప్లెక్స్ గదులను టెండరు పద్ధతిలో కాకుండా బీరం శ్రీధర్‌రెడ్డి కళాశాలకు ఇచ్చారని, దాన్ని రద్దు చేసి రిజర్వేషన్ పద్ధతి ప్రకారం ఎస్సీ ఎస్టీలకు కూడా కేటాయించాలన్నారు. అనంతరం వారు డీఆర్వోకు వినతిపత్రాన్ని సమర్పించారు.


600 మంది బాధితుల పేర్లను చేర్చాలి

– ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



జమ్మలమడుగు: గండికోట ప్రాజెక్టు మొదటి విడత గ్రామాలైన 14 గ్రామాలలో 600 మంది బాధితుల పేర్లు గెజిట్‌లో రాలేదని, అధికారులు విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శాసనమండలిలో సోమవారం ఆయన గండికోట బాధితుల పరిహారం విషయమై ప్రభుత్వాని ప్రశ్నించారు. 14గ్రామాలలో అధికారులు నిర్వహించిన సోషియో ఎకనామిక్ సర్వేలో ముంపుబాధితులకు సంబంధించిన 600 మంది బాధితుల పేర్లు లేవని, నిజమైన లబ్ధిదారులైన వీరికి ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలన్నారు. రెవెన్యూ అధికారులు సోషియో ఎకనామిక్ సర్వే జరిపి ప్రభుత్వానికి ఇప్పటికే నివేదికలను ఇచ్చారని, ప్రభుత్వం బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి వర్తింపజేయాలని కోరారు.

పరిహారం జాబితాలో పేరు లేదని ఆందోళన



బాధిత కుటుంబానికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ, తహసీల్దార్

కొండాపురం : గండికోట జలాశయంలో అంతర్భాగమైన గండికోట ఎత్తిపోతల పథకంలోని ఎస్.తిమ్మాపురం చెరువు పరిధిలో ముంపునకు గురైన చిన్నపల్లె గ్రామం సోషియల్ ఎకనామిక్ సర్వే జాబితాలో తన పేరు లేదని అశ్వర్థరెడ్డి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. సోమవారం మండల తహసీల్దార్ గుర్రప్ప రెవెన్యూ సిబ్బందితో చిన్నపల్లె గ్రామంలో నిర్వాసితులతో అక్విడెన్స్‌లో సంతకాలు సేకరించేందుకు వెళ్లారు. పరిహారం జాబితాలో తన పేరు లేదని అధికారులను నిర్వాసితుడు అశ్వర్థరెడ్డి అడ్డుకున్నాడు. ఈ సందర్భంగా అతని భార్య పెట్రోల్ పోసుకునేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ అక్కడికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లెకు చెందిన రైతు శ్రీనివాసులురెడ్డికి చెందిన పాడిఆవు సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపాడు. పాడి ఆవును గ్రామ సమీపంలో మేత కోసం వదలగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రమాదవశాత్తూ తగిలి మృత్యువాతపడింది.

రహదారులను కమ్మేసిన పొగమంచు



దట్టంగా అలుముకున్న పొగమంచు



జమ్మలమడుగు రోడ్డులో లైట్లు వేసుకొని వస్తున్న వాహనాలు

పొగమంచు ప్రొద్దుటూరును కమ్మేసింది. సోమవారం తెల్లారేసరికి దట్టంగా కమ్ముకున్న మంచులో ఇళ్లు కనిపించలేదు. దగ్గరగా ఉన్న మనిషికి మనిషి కనిపించని పరిస్థితి నెలకొంది. పొగమంచు అలుముకోవడంతో దారి కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పట్టపగలే హెడ్ లైట్లను వేసుకొని నెమ్మదిగా నడుపుకుంటూ వెళ్తున్నారు. పట్టణ శివారులోని రింగ్‌రోడ్డులో అయితే పొగమంచు రహదారులను పూర్తిగా కప్పేయడంతో లారీలు, ఇతర భారీ వాహనాలను రోడ్డు పక్కన నిలుపుకున్నారు. ఉదయం 9 గంటల తర్వాత మంచు తగ్గడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. – ప్రొద్దుటూరు క్రైం